ఇంటింటా 'సోలార్' కాంతులు

- పీఎం సూర్యఘర్‌తో నిరంతర వెలుగులు
- రాయితీపై సోలార్ విద్యుత్ పరికరాలు మంజూరు
- ఆసక్తి చూపుతున్న వినియోగదారులు



దెందులూరులో సాయిబాబా ఆలయంపైన ఏర్పాటు చేసిన విద్యుత్ సోలార్ ప్యానళ్లు

దెందులూరు: సోలార్ వ్యవస్థతో ఇంటింటా నిరంతరాయంగా విద్యుత్ కాంతులు వెదజల్లడంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్య ఘర్ – ముఫ్త్ బిజిలీ యోజనను అమలు చేస్తోంది. ప్రజలకు సౌర విద్యుత్ ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. భవనంపై భాగంలో సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకుని సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగించుకోవడంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు తరలించి ఉపయోగించుకోవచ్చు. నిరంతర విద్యుత్‌తో పాటు విద్యుత్ అంతరాయాలు, లోఓల్టేజ్, విద్యుత్ బిల్లుల సమస్యలకు చెక్ పెట్టేలా ఈ పథకాన్ని రూపొందించారు. పెట్టుబడి సులభంగా తిరిగిరావడంతో పాటు సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వం కూడా సబ్సిడీ అందించడంతో ఈ పథకానికి స్పందన బాగుంది. దెందులూరు నియోజకవర్గంలో విద్యుత్ వినియోగదారులు సూర్య ఘర్ పథకంపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడిప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, దేవాలయాలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తిని చేసి వినియోగిస్తున్నారు.

వినియోగదారులకు అందించే రాయితీ

ఒక్కో ఇంటికి గరిష్ఠంగా 3 కిలోవాట్లకు రూ.78 వేల చొప్పున రాయితీఇస్తోంది. పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం రాయితీ కింద ఒక్కో కిలోవాట్‌కు రూ.30 వేలు సబ్సిడీని కేంద్రం అందిస్తుంది. రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు అయితే రూ.78 వేలు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. అంటే మూడు కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేయడానికి రూ.1.45 లక్షలు ఖర్చయితే అందులో కేంద్రం గరిష్ఠంగా రూ.78వేలు భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచికత్తు అవసరం లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చు.

విద్యుత్ ఖర్చులు ఆదా ఎంత?

సూర్య ఘర్ వెబ్‌సైట్ ప్రకారం 1 కిలోవాట్‌కు సుమారు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అంటే ప్రస్తుత వినియోగం ప్రకారం నెలకు రూ.1000 విద్యుత్ బిల్లు వస్తుంది. అదే సోలార్ ఏర్పాటువల్ల అయ్యే ఖర్చు రూ.338 మాత్రమే అవుతుంది. దీంతో ఏటా రూ.8 వేలు ఆదా అవుతుంది. అదే నెలకు 240 యూనిట్లు వినియోగించే వారికైతే నెలకు రూ.2 వేల వరకూ బిల్లు వస్తుందనుకుంటే సోలార్ వ్యవస్థ ఏర్పాటువల్ల రూ.333 మాత్రమే ఖర్చు అవుతుంది. 360 యూనిట్లు వినియోగించే వారికి ఏటా రూ.32 వేలు వరకూ ఆదా అవుతుందని ఏపీఈడీసీఎల్ తాజాగా తెలియజేసింది.

సులభంగా పెట్టుబడి వెనక్కి

సబ్సిడీ, బ్యాంకు రుణంతో పాటు పెట్టుబడి ఆరు, ఏడేళ్లల్లో తిరిగి వస్తుంది. సూర్య ఘర్ ప్యానల్స్ ఏర్పాటు చేసిన 30 రోజుల్లో వినియోగదారుల ఖాతాలో రాయితీ జమ చేస్తారు. ముందుగా వినియోగదారుడి తమ బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. 100 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలో వాట్ రూఫ్‌టాప్ కేపాసిటీ విద్యుత్ ఉత్పత్తికి 3-4 ప్యానల్స్‌ను వినియోగిస్తారు.

ప్యానల్స్... నెట్ మీటరింగ్ ఏర్పాటు

విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. భవనంపై భాగంలో కొంత చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ అమరుస్తారు. ప్రస్తుతం వాడే విద్యుత్ మీటరు స్థానంలో నెట్‌మీటరింగ్ ఏర్పాటు చేసి దీని ద్వారా సోలార్ విద్యుత్ వినియోగం లెక్కిస్తారు. అదనపు విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారు. కిలో వాట్‌ను బట్టి సబ్సిడీ మంజూరు చేస్తారు. మిగిలిన సొమ్ము మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు. వినియోగదారులు వాయిదాల పద్ధతిలో రుణం చెల్లించాల్సి ఉంటుంది.

ఎవరికి ఎంత సామర్థ్యం

నెలకు 0-150 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని సూర్య ఘర్ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. 150-300 యూనిట్ల చొప్పున వినియోగించే వారు 2-3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. 300 యూనిట్లకు పైబడి విద్యుత్‌ను వినియోగించే వారు 3 కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. 3 కిలోవాట్, ఆ పైబడి సామర్థ్యం కలిగిన సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నా గరిష్ఠంగా రూ.78 వేలు మాత్రమే సబ్సిడీగా చెల్లిస్తారు. మిగులు విద్యుత్‌ను కావాలంటే నెట్ మీటరింగ్ ద్వారా విక్రయించుకోవచ్చు.

ప్రజల స్పందన బాగుంది



దెందులూరు నియోజకవర్గంలో సూర్యఘర్ పథకం కోసం దరఖాస్తులు వస్తున్నాయి. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్న వినియోగదారులు నిరంతర విద్యుత్ పొందవచ్చు. పెట్టిన పెట్టుబడి త్వరగానే తిరిగి వస్తుంది. రూఫ్‌టాప్ కోసం విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయవచ్చు.

– పీ.సాల్మన్, ఎస్‌ఈ, ఏలూరు ట్రాన్స్‌కో

స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలి



గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ నిరంతర విద్యుత్ సౌకర్యాన్ని పొందాలి. ప్రజలందరికీ తక్కువ ధరకు విద్యుత్ వినియోగం పొందడానికి సోలార్ వినియోగంపై స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతగా ప్రచారంలో భాగస్వాములు కావాలి. క్షేత్రస్థాయిలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలి.

– సీహెచ్. అవినాష్‌రాజు, లయన్స్ క్లబ్ డైరెక్టర్, పెదవేగి

రైతులకు మరింత మేలు



గృహ అవసరాలతో పాటు దేవాలయాలు, అపార్ట్‌మెంట్లు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రైతులకు సోలార్ విద్యుత్ వాడకం మరెంతో మేలు చేస్తుంది. రైతు సంఘాలు, రైతు నాయకులు సోలార్ విద్యుత్ వినియోగంపై మరింత అవగాహన కల్పించాలి. ఈ పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలి.

– వీరమాచినేని శివాజీ, ఆదర్శ రైతు, దెందులూరు

క్లుప్తంగా

అబ్బయ్య చౌదరికి వైఎస్సార్‌సీపీ నేతల సంఘీభావం



అబ్బయ్యచౌదరికి సంఘీభావం పలికిన పార్టీ నేతలు

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. విజయవాడ కనకదుర్గమ్మ తల్లి ఆలయ బోర్డు మాజీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, పార్టీ నాయకులు తొత్తడి కృష్ణకుమార్ బాబు, దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కొలుసు గణపతిరావు, జిల్లా కార్యదర్శులు కట్ట ఏసుబాబు, చల్ల మేరీ రాజు, కొంగర రత్న కుమార్, దెందులూరు మండల యువజన విభాగం అధ్యక్షుడు గొరిపర్తి శ్రీనివాస్ తదితరులు కొఠారును కలిశారు. పార్టీకి కొఠారు కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు సంఘీభావాన్ని ప్రకటించారు.

ధ్యాన సాయి మందిరంలో ఘనంగా వార్షికోత్సవం

దెందులూరు: సత్యనారాయణపురంలోని ధ్యాన సాయి మందిరం 16వ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా శనివారం నిర్వహించారు. కలపాల విజయ్ కుటుంబ సభ్యులు మాగం సత్యనారాయణ, ఎంఎస్‌పీ చౌదరి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. షిర్డీ సాయిబాబాకు పలు రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. విశిష్ట అలంకరణలో పూజలు ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

దివ్యాంగ చిన్నారుల గుర్తింపుపై సర్వే

దెందులూరు: సీతంపేటలో దివ్యాంగ చిన్నారులను గుర్తించేందుకు ప్రత్యేక సర్వేను శనివారం పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్ కుమార్, కే చైతన్య ఆధ్వర్యంలో ఏలూరు న్యాయశాఖ సిబ్బంది నిర్వహించారు. ప్రభుత్వం వైద్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 1 నుంచి 18 ఏళ్లలోపు ఉన్న దివ్యాంగ చిన్నారుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించినట్టు న్యాయశాఖ సిబ్బందికి వైద్యాధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ప్రభాకర్ రావు, పీహెచ్ఎన్ అరుంధతి దేవి, ఎంపీహెచ్ఎస్ హరి, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలికి సత్కారం

ఉంగుటూరు: యర్నగూడెం హైస్కూలుకు చెందిన పూర్వ విద్యార్థులంతా కలిసి హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారికి బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పిన ప్రస్తుతం బొమ్మిడి హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవిని శనివారం పాఠశాలలో శాలువా కప్పి సత్కరించి, మెమెంటోను అందజేశారు. పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలకు సంబంధించి వాల్ పోస్టర్‌ను శ్రీదేవితో ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మాట్లాడుతూ బాల్యంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న ఎర్నగూడెం విద్యార్థులు ఈరోజు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం చాలా గర్వంగా ఉందన్నారు. మరిన్ని కార్యక్రమాలు చేసి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కావలి పరపు బాలకృష్ణ మాట్లాడుతూ మాకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులుగా ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సెక్రటరీ ప్రసాదు గన్నిరాజు, తనుజ, శివకుమార్, చంద్రశేకర్, వెంకటన్న పాల్గొన్నారు.

కనుల పండువగా భోగ శ్రీనివాసమూర్తికి పూజలు



గుండుగొలనులో భోగ శ్రీనివాసమూర్తి లోహ విగ్రహంతో కోవెల ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్ల ఆలయంలో శాంతి కల్యాణం, కోవెల ప్రదక్షిణ హోమాలు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని దాతలు కోడూరి శివరాం కృష్ణ, నరసింహమూర్తి, వంశీ ఆర్థిక సాయంతో ఆలయంలో భోగ శ్రీనివాస మూర్తి లోహ మూల విరాట్ విగ్రహాన్ని స్వామి వారి పాదాల చెంతన ఉంచేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో రెండు రోజులుగా విశేష పూజలు చేసారు. ముగింపు రోజైన శనివారం పూజల అనంతరం స్వామి వారి పాదాల చెంతన శ్రీనివాసమూర్తి లోహ విగ్రహాన్ని ఉంచి పూజలు చేశారు. అర్చకుల బృందం గోపూజా దర్శనం, హోమం నిర్వహించారు. మేళతాళాల నడుమ స్వామి వారితో ఆలయ కోవెల ప్రదక్షిణ చేసారు. తొలుత పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి, అచ్యుత రామయ్య, శ్రీసత్యసాయి సేవ సంస్థల అధ్యక్షుడు కోడూరి నరసింహమూర్తి, పెద్దలు దోకల మురళి, డాక్టర్ రమణమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం



సాయి పుస్తకాలను 100 అడుగుల స్థూపంలో నిక్షిప్తం చేస్తున్న భక్తులు

పెదవేగి : లక్ష్మీపురం గార్డెన్స్‌లోని షిరిడీ సాయిబాబా సేవాశ్రమంలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు సాయిబాబాకు కాకాడ హారతి, సుప్రభాతం, అభిషేకాలు నిర్వహించారు. బాబా రోజుకొక ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆఖరి రోజు శనివారం బాబాకు పుష్పాభిషేకం చేశారు. తెల్లవారుజామున నాలుగున్నర గంటల నుంచి ఐదు కోట్ల శ్రీ సాయి నామములు గల సాయి కోటి పుస్తకములను భక్తుల చేతుల మీదుగా సాయి వరలక్ష్మి 100 అడుగుల ఎత్తు గల మహాస్తూపంలో నిక్షిప్తం చేశారు. కార్యక్రమంలో అశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు



గణపవరం పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: ఆరోగ్యమే మహాభాగ్యమని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ద్వారానే సంపూర్ణ ఆరోగ్యవంతులవుతామని భీమడోలు ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ అన్నారు. భీమడోలులోని శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది కళాశాల విద్యార్థులకు పరిశుభ్రత కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఎక్సైజ్ సిబ్బంది కళాశాల ప్రాంగణంలోని చెత్తను శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం యువతీ యువకులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపల్స్ బొమ్మ రవికుమార్, ఎన్ఎస్ఎస్ పీవో శశికాంత్, ఎక్సైజ్ ఎస్సై శివధర్, కానిస్టేబుల్స్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. గుండుగొలను-1 ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో-1 ఈదుపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆమె ఆకస్మిక సందర్శన చేసారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా పాఠశాల తరగతి గదులు, పరిసరాల పరిశుభ్రతను ఆమె పరిశీలించారు. ఎండీఎం సిబ్బందికి తగు సూచనలందించారు. పాఠశాలలోని విద్యార్థుల విద్యాభివృద్ధిని పరిశీలించారు. హెచ్ఎం పాశం పాండురంగారావు పాఠశాల పురోగతిని డీఈవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ ఎస్.సునీత అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి వైద్యులంతా ప్రతిజ్ఞ చేయించారు. అన్ని విభాగాల వైద్యులు, శానిటేషన్ సిబ్బంది, ల్యాబ్, ఫార్మసీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

పెదపాడు: విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం, వివిధ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణాన్ని శుభ్రంచేసి మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే పరిశుభ్రతపై అవగాహన

గణపవరం: పచ్చదనం, పరిశుభ్రత అనేవి మనిషి జీవితంలో అతిముఖ్యమైనవిగా భావించి, చిన్నతనం నుంచే వీటిపై పిల్లల్లో అవగాహన కలిప్తే మంచి ఫలితాలు ఉంటాయని గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. శనివారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నోడల్ అధికారి వెంకట్రావు, వైస్‌ప్రిన్సిపల్ పి.మధురాజు, సీహెచ్‌వో జాలాదివిల్సన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చునని, పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, పి.కిరణ్మయి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ ఆవరణలో పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించారు. పారిశుద్ధ్యంపై సిబ్బంది స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్

పెదవేగి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించారు. సిబ్బంది ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ రోజ్‌మేరీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఉపాధ్యాయుల ఆర్థిక సాయం



విద్యార్థి కుటుంబానికి సాయం అందజేసిన ఉపాధ్యాయులు

దెందులూరు: చెరువులో పడి మృతి చెందిన సీతంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థి గణేష్ కుటుంబానికి ఆ పాఠశాల ఉపాధ్యాయుడు తోట ఎడ్వర్డ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆర్థికసాయం అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. అందరూ కలిసి రూ.33వేలు నగదును శనివారం బాధిత కుటుంబానికి ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు తోట ఎడ్వర్డ్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థి చెరువులో పడి మృతి చెందిన ఘటనను నేటికీ తాము జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. తమ వంతు కర్తవ్యంగా మానవతా దృక్పథంతో ఈ విషయం తెలిసిన వెంటనే ఉపాధ్యాయులందరూ స్పందించి ఆర్థిక సాయాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీత, రాజ్యలక్ష్మి, విజయకుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

దెందులూరు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం కూలీ గుండెపోటుకు గురై మృతి చెందింది. దెందులూరు జాతీయ ఉపాధి పథకం ఏపీవో దశరథ రామ్‌జీ, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం దెందులూరు మండలం ముప్పవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కంద్రిక నరసింహపురానికి చెందిన గులిమే జయమ్మ (50) ముప్పవరం పంచాయతీ పరిధిలోని గరిక మొక్కల చెరువులో ఉపాధి కూలి పని చేస్తుండగా శుక్రవారం గుండె నొప్పి రావడంతో అస్వస్థతకు గురై పని ప్రదేశం నుంచి చెరువుగట్టు పైకి వచ్చింది. ఇంతలోనే గుండె నొప్పి అధికమై కప్పకూలి జయమ్మ మృతి చెందింది. స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి



ఉంగుటూరు క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

భీమడోలు: ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. నూతనంగా అమలు చేస్తున్న క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా భీమడోలు, గుండుగొలను, పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తొలి సమావేశాలు శనివారం మధ్యాహ్నం నుంచి నిర్వహించారు. భీమడోలు ఉన్నత పాఠశాలలోని ఈ సమావేశాన్ని ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. భీమడోలు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి 67 మంది ఎస్జీటీ, స్కూలు అసిస్టెంట్లు హాజరు కావాల్సి ఉండగా వారిలో 63 మంది హాజరయ్యారు. ఒకటి, రెండు తరగతులను బోధించే టీచర్లను ఒకటిగా, 3, 4, 5 తరగతులు బోధించే టీచర్లకు ఒక చోట వేర్వేరుగా కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశానికి హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు క్లస్టర్ కాంప్లెక్స్ చైర్మన్‌గా వ్యవహరించారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు విద్యా వ్యవస్థలో భాగంగా నూతనంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో టీచర్లు పాల్గొన్నారు.

శిక్షణ అంశాలను బోధనలో అమలు చేయాలి

ఉంగుటూరు: బాదంపూడి, ఉంగుటూరు, నారాయణపురం, కైకరం నాలుగు క్లస్టర్ సమావేశాలు శనివారం నిర్వహించారు. బాదంపూడి హైస్కూల్ ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ క్లస్టర్ సమావేశంలో నేర్చుకున్న విషయాలు క్లాస్ రూమ్‌లో అమలు చేయాలన్నారు. బొమ్మిడి హైస్కూల్ హెచ్‌ఎం పి.శ్రీదేవి, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించాలి

పెదపాడు: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో ఆకర్షణతో కూడిన విద్యను అందించాలని పెదపాడు ప్రాజెక్టు ఏసీడీపీవో ఎం సునీల్ రాజశేఖర్ తెలిపారు. పెదపాడు మండలంలోని పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడురోజుల పాటు నిర్వహించిన పోషణ బీ- పఢై బీ శిక్షణ నేటితో ముగిసింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపం లేకుండా సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలతో మంచి ఆహారాన్ని చిన్నారులకు అందించాలన్నారు. పెదపాడు ప్రాజెక్టు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ ఫాతిమా మున్నీషాబేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

పెదవేగి : పెదవేగి మండల కేంద్రమైన జెడ్పీహెచ్ పాఠశాల్లో మూడు రోజుల అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమానికి పెదపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ కె విజయలక్ష్మి హాజరై పలు అంశాలు వివరించారు. శనివారం శిక్షణ ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైక్రో న్యూట్రియన్స్, నవజాత శిశువు, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ, సూక్ష్మ, స్థూల కండరాల అభివృద్ధి తదితర అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు.



పెదపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారి సునీల్ రాజశేఖర్



గణపవరం: అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో బాలయ్య

అంగన్‌వాడీలు బాధ్యతగా పనిచేయాలి

గణపవరం: నూతన విద్యావిధానం ప్రకారం ఏర్పాటయ్యే శాటిలైట్ స్కూల్స్, శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ స్కూల్స్ విజయవంతంగా నడవాలంటే అంగన్‌వాడీ కార్యకర్తలు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని గణపవరం ఎంఈవో-2 గొర్రెల బాలయ్య అన్నారు. శనివారం గణపవరం బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో ఆయన పలు అంశాలు వివరించారు. సీడీపీవో టీఎల్ తులసి, పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చందావతి పాల్గొన్నారు.

ఆట పాటలతో కూడిన విద్య అవసరం

దెందులూరు: మంచి ఆహారం, ఆటపాటలతోకూడిన విద్య చిన్నారులకు అవసరమని ఐసీడీఎస్ పెదపాడు ప్రాజెక్టు ఆఫీసర్ కే.విజయలక్ష్మి, అడిషనల్ సీడీపీఓ రాజశేఖర్ అన్నారు. శనివారం దెందులూరు ఉన్నత బాలికల పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు దెందులూరు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో సోమవరప్పాడు దెందులూరు ఐసీడీఎస్ సెక్టార్ల సూపర్‌వైజర్ భూషణం, చిట్టెమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు అవగాహన, శిక్షణ సమావేశం నిర్వహించారు.

దివ్యాంగుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

భీమడోలు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని దివ్యాంగుల ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పూళ్ల క్లస్టర్ సూపర్‌వైజర్ నూర్జహాన్ అన్నారు. భీమడోలు, గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోషణ్ బీ, పఢై బీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. భీమడోలు ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ సిబ్బందికి నూర్జహాన్ అవగాహన కల్పించారు. తొలుత తక్కువ ఖర్చుతో పూర్వ ప్రాథమిక విద్య టీఎల్ఎంలను కార్యకర్తలు తయారు చేసారు.